అర్హతలున్నా 'సంక్షేమం' దూరం

- పథకాల అమలులో ఘోర వైఫల్యం
- ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కూటమి సర్కార్
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ ధ్వజం



ఉప్పార్లపల్లిలో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

నల్లచెరువు: కూటమి ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ ధ్వజమెత్తారు. ఉప్పార్లపల్లిలో మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'పై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ హాజరయ్యారు. తమకు అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందడం లేదని పలువురు మహిళలు సమన్వయకర్త దృష్టికి తీసుకొచ్చారు. సమన్వయకర్త మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించడం పరిపాటిగా మారుతోందన్నారు. సూపర్ సిక్స్ సహా దాదాపు 140 హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎన్ని హామీలు నెరవేర్చిందో చెప్పాలని ప్రశ్నించారు. తల్లికి వందనం ప్రవేశపెట్టి అనేక కొర్రీలు వేసి అర్హులను సైతం అనర్హులను చేశారన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన, ఆడబిడ్డ నిధి, ఫ్రీ బస్సు హామీలను ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. చంద్రబాబు పాలనలో ప్రతి కుటుంబానికీ ఎంత నష్టం జరిగిందనే విషయాన్ని ప్రతి గడపకూ తీసుకెళ్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే ప్రజాగళం, సూపర్ సిక్స్ హామీలు, చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చేసిన మోసం వివరాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కదిరి పట్టణ కన్వీనర్ బాబ్‌జాన్, తనకల్లు కన్వీనర్ అశోకవర్ధన్‌రెడ్డి, వైస్ కన్వీనర్లు సోమిరెడ్డి, రఫి, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, కె.రమణారెడ్డి, పోలం మాధవరెడ్డి, షెక్షావలి, ఎంపీటీసీ నరసింహారెడ్డి, సర్పంచ్ యూసుఫ్, ఎస్టీ సెల్ హైటెక్ రమణ, రైతు విభాగం మండల అధ్యక్షుడు పోలం సూర్యశేఖర్‌రెడ్డి, మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మైనార్టీ నాయకులు బాబాఖాన్, నజీర్, యూత్ కన్వీనర్ మన్సూర్ బాషా, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, మాజీ డైరెక్టర్ ఆదిమూర్తి పాల్గొన్నారు. ఇంకా వీరితో పాటు పార్టీ గ్రామ కన్వీనర్ మంజునాథ నాయుడు, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీపతి, సలీం, ట్రేడ్ యూనియన్ నాయకులు వేమయ్య, బీసీ కన్వీనర్ చిన్నపల్లి హరి నాయకులు పోలం సిద్దారెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు, అమరనాథ్‌రెడ్డి, వార్డు మెంబర్ నాగరాజు, కరీం ఖాన్, ఎ.శంకర, ఎం.క్రిష్ణారెడ్డి, జేసీబీ సూర్యశేఖర్‌రెడ్డి, వీరారెడ్డి, కె.చంద్రశేఖర్, రామన్న, జేపీ ఆంజనేయులు, ఆకుల గణేష్, ఆదినారాయణ, సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, రమణప్ప, శ్రీనివాసులురెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి అష్రఫ్, ఇర్ఫాన్, శ్రీపతి, తాజుద్దీన్, కె.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

పుట్టపర్తి అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గజ్జల హరిప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో ఉపాధ్యక్షులు చరణ్, ఖాసీం సాహెబ్, సాంబశివారెడ్డి, సురేంద్రతో కలిసి ఏడీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సస్పెన్షన్లు, చార్జ్ మెమోలు ఇచ్చి ఎంక్వైరీలను సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉంచి ఇబ్బంది పెడుతున్నారని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. బదిలీ పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జూన్, జూలై, ఆస్టు జీతాలను తక్షణమే చెల్లించాలన్నారు. కర్మయోగి, పీ–4 కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి చర్యలు



మర్రిమాకులపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

తాడిమర్రి: తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో కలసి మండలంలోని చిన్నచిగుళ్లరేవు, మర్రిమాకులపల్లి గ్రామాల్లో పర్యటించారు. మర్రిమాకులపల్లి పాత కాలనీ, చిన్నచిగుళ్లరేవులో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలకు ఎస్టిమేట్లు తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏ గ్రామంలో తాగునీటి సమస్య ఎదురైనా వెంటనే స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాంతన్న, జేఈ ఫమీద పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో 'సంస్కృతి' విద్యార్థుల సత్తా



'సంస్కృతి' విద్యార్థులు, క్రీడాప్రాధికార సంస్థ అధికారులు

పుట్టపర్తి అర్బన్: హిందూపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో పుట్టపర్తి సంస్కృతి విద్యా సంస్థల విద్యార్థులు హర్షవర్ధన్, సుమంత్‌రెడ్డి, హేమంత్‌కుమార్ నాయక్ సత్తా చాటారని పీడీ రాము చెప్పారు. వీరిని ఈ నెల 12న తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ హేమచంద్ర, అధ్యాపక బృందం అభినందించారు.

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికడదాం



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ అర్చన

కదిరి అర్బన్: మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అనంతపురం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు (జాయింట్ డైరెక్టర్) జి.అర్చన తెలిపారు. బుధవారం కదిరిలోని బ్లూమూన్, వివేకానంద డిగ్రీ కళాశాలల్లో మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత సన్మార్గంలో తమ లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తుంటారని, వారి ఆశలను అడియాసలు చేయకుండా ఉన్నతంగా ఎదగాలన్నారు. మాదక ద్రవ్యాలు అమ్మినా, నిల్వ ఉంచినా, వాడినా చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి



గోదామును పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆర్డీఓ మహేష్ తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డులోని సివిల్ సప్లయ్ గోడౌన్‌ను బుధవారం ఆర్డీఓ తనిఖీ చేశారు. నిల్వ ఉన్న నిత్యావసర సరుకులు బియ్యం, చక్కెరను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. గోదాము నిర్వహణ, సరుకుల నిల్వ పరిస్థితులు, పరిశుభ్రత, తూకం యంత్రాల వాడకాన్ని పరిశీలించారు. అక్కడ విధుల్లోనున్న పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పీడీఎస్) సిబ్బందితో ఆర్డీఓ మాట్లాడారు. సరుకులు పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు.

వృద్ధుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలన

తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, శ్రేయస్సు చట్టం 2007 (సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007) కింద దాఖలైన రెండు కేసులను ఆర్డీఓ స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు, కుటుంబ సభ్యుల వేధింపులపై విచారణ చేపట్టారు.

ఆధార్ సమస్యలపై సమీక్ష

ధర్మవరం రూరల్: సీసీ కొత్తకోట గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆర్డీఓ మహేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకంలో తప్పుడు ఆధార్ లింకింగ్ సమస్యపై సమీక్షించారు.

బాబు జీవితమంతా అబద్ధాలే



మహమ్మదాబాద్‌లో పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓడీచెరువు (అమడగూరు) : చంద్రబాబు జీవితమంతా అబద్ధాలు, మోసాలు, కుట్రలేనని వైఎస్సార్‌సీపీ అమడగూరు మండల కన్వీనర్ జయప్ప విమర్శించారు. మహమ్మదాబాద్ పంచాయతీలోని మహమ్మదాబాద్, గొల్లపల్లి, వడ్డివారిపల్లిలో బుధవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఏడాది దాటిపోయినా హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ అనుబంధ మైనారిటీ సెల్ సిబక్తుల్లా, మండల ప్రధాన కార్యదర్శి ఉత్తప్ప, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నక్కల చెన్నప్ప, నరసింహులు గంగులమ్మ, మహబూబ్ బాషా, రాంప్రసాద్, తబ్రేజ్, జహీర్, శీనా, అంజి, గోపాల్ రెడ్డి, జిలాన్, మౌలాలి ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలపై విస్తృత ప్రచారం



అగ్రహారంలో బాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం అగ్రహారంలో బుధవారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల హామీలు అమలు కాకపోవడంతో ఒక్కో కుటుంబం ఎంత మేర నష్టపోయిందో.. చంద్రబాబు చేసిన మోసాల గురించి ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ నాగేంద్రమ్మ, సీనియర్ నాయకులు మల్లేశ్, లింగమయ్య, శివయ్య, మండల ప్రధాన కార్యదర్శి గోపిస్వామి, కొత్తకోట రఘు, శివయ్య, ఎంపీటీసీ కిష్టయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, మండల బూత్ లెవల్ కమిటీ మేనేజర్ పతంజలి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఎల్‌ఐసీ చంద్ర, ఎస్సీ సెల్ విభాగం మండల శాఖ అధ్యక్షుడు నీలూరి ఈశ్వర్, గోవిందు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న చంద్రకళ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సిద్దయ్యగుట్టలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జగ్గా చంద్రకళ రూ.లక్ష విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షురాలు జయశ్రీకి అందించారు. మరికొంతమంది దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందించాలని ఆమె కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం రూరల్: ధర్మపురి ఆర్డీటీ పాఠశాలలో బుధవారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



సీకేపల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ కవితాదేవి



సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు, ఐసీడీఎస్ అధికారులు

పుట్టపర్తి అర్బన్: అప్పుడే పుట్టిన బిడ్డకు ఇచ్చే తల్లిపాలు అమృతంతో సమానమని వైద్యాధికారి డాక్టర్ నివేదిత, సీడీపీఓ జయంతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుజాత పేర్కొన్నారు. బుధ వారం పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువులో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత అనుబంధ పోషకాహారంతో పాటు తల్లిపాలు అందించాలని సూచించారు. తల్లిపాలు బిడ్డకు ఇవ్వడంతో రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి నవజాత శిశువుల తల్లులకు వారి ఇంటికి వెళ్లి తల్లిపాల ప్రాముఖ్యత తెలియజేశారు. బాల్య వివాహాలతో వచ్చే అనర్థాలను వివరించారు. అనంతరం ఆశా డే నిర్వహించారు. కార్యక్రమంలోహెల్త్ సూపర్ వైజర్ సుజాత, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి, సీహెచ్ఓ పార్వతమ్మ, ఏఎన్ఎం సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వనజ, మాలతి, జరీన, కల్పన పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: బిడ్డకు తల్లి పాలు అమృతంతో సమానం. బిడ్డకు తల్లిపాలను తప్పక తాపించాలని సీడీపీఓ కవితాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బిడ్డకు పాలు ఇవ్వడం వలన బిడ్డకు తల్లికి మధ్య అనుబంధం ఏర్పడుతుందన్నారు. చిన్నారులపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రశాంతి, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో యశోద విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం: బెంగళూరులో ఈ నెల 3న జరిగిన జపాన్ కరాటే షోటోకాన్ 13వ జాతీయస్థాయి పోటీల్లో యశోద పాఠశాల విద్యార్థి మహిధర్ రెండు విభాగాల్లో బంగారు పతకాలు సాధించి కరాటే చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా మహిధర్‌ను పాఠశాల డైరెక్టర్ పృధ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ బుధవారం అభినందించారు.

బహిరంగ మద్యపానంపై కేసులు



మందుబాబులను అదుపులోకి తీసుకుంటున్న ఎస్‌ఐలు

కదిరి టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేస్తామని పట్టణ ఎస్‌ఐ బాబ్జాన్ తెలిపారు. కదిరి ప్రాంతంలో డ్రోన్ సహకారంతో ప్రత్యేక నిఘా పెట్టి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి ఆరుగురిని అదుపులోకి తీసుకుని, కేసులు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్‌ఐ డి.సుమతి తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తరగతుల నిర్వహణపై ఆరా



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ క్రిష్టప్ప

గాండ్లపెంట: కటారుపల్లి ఉన్నత పాఠశాల, మోడల్ ప్రాథమిక పాఠశాలను డీఈఓ క్రిష్టప్ప బుధవారం ఆకస్మికంగాతనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం తరగతుల నిర్వహణ, సిలబస్ ఎంతవరకు పూర్తయ్యిందనే విషయాలపై ఆరా తీశారు. మోడల్ ప్రాథమిక పాఠశాలలో 84 మంది విద్యార్థులుండగా అందరూ యూనిఫాం ధరించడంపై డీఈఓ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈఓను ఉన్నత పాఠశాల హెచ్ఎం సరళ, ప్రైమరి పాఠశాల హెచ్ఎం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



మండల కార్యవర్గ సభ్యులతో ఏపీటీఎఫ్ నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్యాదిండి మోడల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నిక అధికారి రవీంద్రరెడ్డి తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా అల్లే వెంకటరాముడు, అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా సాయిరాం, జీవిత, వెంకటేశులు, కార్యదర్శులుగా నాగేంద్ర ప్రసాద్, హనుమంతు, నవ్యత, సత్యనారాయణ, జిల్లా కౌన్సిలర్లుగా మరెప్ప, రవికుమార్, విజయరాధిక, రామాంజనేయులు, ఓబుళేసు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాసులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్, ముత్యాలప్ప, జిల్లా ఆడిట్ కన్వీనర్ నాగభూషణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో భజనలు చేయాలి



సూచనలు ఇస్తున్న సేవా భారతి అధ్యక్షుడు

కదిరి టౌన్: ప్రతి ఏటా శ్రావణ మాసంలో సేవా భారతి ఆధ్వర్యంలో భజన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సేవా భారతి అధ్యక్షులు మట్టా చెన్నరాయశెట్టి తెలిపారు. శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం సేవాభారతి ఆధ్వర్యంలో భజన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సేవా భారతి స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కేశవయ్య, అధ్యక్షులు చెన్నరాయశెట్టి హాజరై మాట్లాడారు. కదిరి మండలంలోని 30 గ్రామాల నుంచి 150 మంది భజన సభ్యులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సేవాభారతి సభ్యులు నాగప్ప, నాగేంద్ర, హేమావతి, వెంకరమణమ్మ, కొండారెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం ధర్మపురిలో సిబ్బందితో కలిసి ఆయన గ్రామ సభ నిర్వహించారు. చిన్న చిన్న వివాదాలను పెద్దవిగా చేసుకొని ప్రశాంతత కోల్పోవద్దన్నారు. అన్నదమ్ముల వలె కలిసి జీవించాలన్నారు. చట్టాలను గౌరవిస్తూ చట్ట పరిధిలోనే జీవించాలన్నారు. మహిళల పట్ల గౌరవ భావం కలిగి ఉండాలన్నారు.

ధర్మవరం డివిజన్‌లో 298.2 మి.మీ వర్షం

ధర్మవరం అర్బన్: ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో రెండు రోజుల్లో 298.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ మహేష్ బుధవారం తెలిపారు. ఇందులో ధర్మవరంలో 26.0, బత్తలపల్లిలో 7.6, తాడిమర్రిలో 82.2, ముదిగుబ్బలో 90.8, కనగానపల్లిలో 14.8, చెన్నేకొత్తపల్లిలో 36.8, రామగిరిలో 40.0 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఓ గోపాల్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కదిరి టౌన్: వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ పరిశోధన కేంద్రంలో 20 ఏళ్లుగా 28 మంది మహిళలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్నారన్నారు. వీరికి వేతనాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు, రామ్మోహన్, బాబ్జాన్, ఉదయ్, జగన్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి: బుక్కపట్నంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మగ్బుల్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కంప్యూటర్ అప్లికేషన్, మేథమేటిక్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీలో 55 శాతం, ఆపై మార్కులు సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ఈ నెల 12న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు.

భక్తి శ్రద్ధలతో గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



గాండ్లపెంట: కటారుపల్లి శివారులో బుధవారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కటారుపల్లి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

'నవోదయ'కు ఉచిత కోచింగ్

కదిరి అర్బన్: నవోదయ ప్రవేశ పరీక్ష రాసే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 5 నెలలు పాటు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు కదిరికి చెందిన కేఎల్ఎస్ కోచింగ్ డైరెక్టర్ రమేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 13న జవహర్ నవోదయ విద్యాలయం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5, 8 తరగతులు చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 93986 29919 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టెండర్లపై నేడు అవగాహన సమావేశం

కదిరి అర్బన్: ఆర్టీసీ డిపోలో ఖాళీ స్థలాల టెండర్ల విషయమై గురువారం ఔత్సాహిక వ్యాపారవేత్తలతో అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు డీఎం మైనోద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో ఆవరణలో మొత్తం 9 ఖాళీల ప్రదేశాలకు ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 13న జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో టెండర్లు స్వీకరిస్తారని తెలిపారు. వ్యాపారవేత్తలు డిపోలోజరిగే ఈ సమావేశానికి హాజరై తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు.

13న వేలం పాట

కదిరి అర్బన్ : యర్రదొడ్డి గంగమ్మ ఆలయం వద్ద ఏడాది పాటు పార్కింగ్, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరల అమ్మకానికి ఈ నెల 13న దేవస్థానంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ మురళీక్రిష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ. 50వేల నగదు డిపాజిట్ చేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎల్‌ఆర్ఎస్ సద్వినియోగం చేసుకోండి

ఎన్పీకుంట: అక్రమ లేఅవుట్లు వేసిన రియల్టర్లు, అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎల్‌ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్)ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పార్థసారథి, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి సూచించారు. వారు బుధవారం మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 30 వరకు మండలంలో అనధికార లేఅవుట్లు వేసిన రియల్టర్లు, అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు 90 రోజులలోగా అహుడా నిబంధనల ప్రకారం రుసుము చెల్లించి తమ లేఅవుట్లను, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. ఈ పథకం కింద 45 రోజులలోగా ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లించిన వారికి అహుడా 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తు చేసే సమయంలో 50 శాతం లేదా రూ.10 వేలు చెల్లించాలని తెలిపారు. రెగ్యులైజేషన్ చేయించుకోని లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టడానికి పంచాయతీ వారు అనుమతులు ఇవ్వబోరని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా అమ్మకాలు జరిపినా, నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్‌గా గంగయ్య

కదిరి అర్బన్: వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా కదిరికి చెందిన కొమ్మినేని గంగయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల చైర్‌పర్సన్‌గా ఎన్పీకుంట మండలానికి చెందిన అనసూయను నియమించిన విషయం తెలిసిందే. వీరితో పాటు మరో 13 మందిని సభ్యులుగా నియమించారు.